క్లుప్తంగా

మసీదు నిర్మాణానికి విరాళం



మసీదు నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: పట్టణంలోని కంచుకోటలో ఉన్న అక్సా మసీదు నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ శనివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజిమున్నీసా భర్త పరికి సాదిక్, సీనియర్ నాయకుడు షాన్‌వాజ్ చేతుల మీదుగా మసీదు కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పలువురికి ఆర్థికసాయం



ఆలయ నిర్మాణానికి నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి సతీమణి సుప్రియ

ధర్మవరం: ధర్మవరంలో పలువురికి రూ.1.60 లక్షల ఆర్థికసాయాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సతీమణి సుప్రియ శనివారం అందించారు. పట్టణంలోని రాజేంద్రనగర్‌లో వరసిద్ధి వినాయక ఆలయ నిర్మాణానికి రూ.50 వేలు, వైఎస్సార్ కాలనీలో అయ్యప్పస్వామి భజన మందిరం ప్రహరీ నిర్మాణానికి రూ.50 వేలు, తిక్కస్వామి నగర్‌లో నూతనంగా నిర్మించబోయే కేదారేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రూ.40 వేలు అందజేశారు. ధర్మవరం మండలం పోతుకుంట గ్రామానికి చెందిన రామ్మోహన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో విషయం తెలుసుకుని అతడి భార్య సులోచనకు రూ.20 వేల ఆర్థికసాయం అందించారు.

సజావుగా బహిరంగ వేలం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

ధర్మవరం: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం దినసరి వారపు మార్కెట్, జంతువధ శాలకు సంబంధించి సుంకాల వసూలు అనుమతి కోసం నిర్వహించిన బహిరంగ వేలంపాట సజావుగా ముగిసిందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. వేలంపాటలో ముగ్గురు పాల్గొనగా.. దినసరి వారపు మార్కెట్ వేలంపాటను రాఘవరెడ్డి రూ.60.50 లక్షలకు దక్కించుకున్నారు. జంతువధశాలను ఖాజాముద్దీన్ రూ.1.15 లక్షలకు వేలంపాట పాడి దక్కించుకున్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా టూటౌన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ వేలంపాటలో అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ ఆనంద్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎన్పీకుంట: మండల కేంద్రంలో పాటు పలు గ్రామాలలో శనివారం ఐఎఫ్‌సీఓ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. రైతులు, మహిళల ఆర్థికాభివృద్ధికి ఐఎఫ్‌సీఓ అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి వారి జీవనోపాధికి వివిధ రకాల వస్తు ఉత్పత్తి శిక్షణ, పరిశ్రమల స్థాపనకు సహకారం అందించనున్నట్లు తెలిపారు. ఈ సేవలను మహిళలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, అడ్మిన్, మేనేజర్ శ్యామ్, రీజనల్ మేనేజర్ హుస్సేన్‌వలి, డివిజనల్ మేనేజర్ రఫీ, డీపీఆర్‌ఓలు సుంకన్న, జయన్న తదితరులు పాల్గొన్నారు.

కుల గణన గడువు పెంచాలి

కదిరి అర్బన్: కుల గణన సర్వేకు ఆరు నెలల గడువు పెంచాలని బీసీ కుల సంఘాల నాయకులు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని వడ్డెర సంక్షేమ సంఘం కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం కుల గణన సర్వేకు చాలా తక్కువ గడువు ఇచ్చిందని తెలిపారు. ప్రభుత్వం గడువును మరో ఆరు నెలలు పెంచాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కుల గణన చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం శుభపరిణామన్నారు. అలాగే ఈ గణన ఉపాధ్యాయులతో జరిపిస్తే బాగుంటుందని తెలిపారు. సమావేశంలో బీసీ కుల సంఘాల నాయకులు హరిప్రసాద్, సంపంగి గోవర్ధన్, సైదాపురం రమణ, గంగయ్య పాల్గొన్నారు.

నల్లమాడలో ముగిసిన పాదయాత్ర



కురుమాలలో నాయకులతో కలిసి పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: డాక్టర్ వైఎస్సార్ రైతు విజయ సంకల్ప యాత్రలో భాగంగా తొలిరోజు శుక్రవారం 20.1 కిలో మీటర్లు నడిచి మండలంలోని కురుమాల గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ... ఆ రోజు రాత్రి అక్కడే బస చేశారు. రెండో రోజు శనివారం ఉదయం 9.30 గంటలకు పాదయాత్ర ప్రారంభించి ఓడీ చెరువు మండలం వైపుగా ముందుకు సాగారు. పాదయాత్రలో కురుమాల వైఎస్సార్ సీపీ నేత దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ లింగమూర్తి, నాయకులు పీవీ భాస్కర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా బోర్డు సభ్యులు రవిచంద్రారెడ్డి, అశోక్‌రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు రవిప్రకాష్, రాజారెడ్డి, రెడ్డెప్ప, గిరిజాపతి, మగ్దుం బాషా, శంకర, హబీబుల్లా తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలి కుటుంబ సభ్యులకు పరామర్శ

కురుమాలకు చెందిన శ్రీనివాసులు కుటుంబీకులను ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి శుక్రవారం రాత్రి పరామర్శించారు. గతనెల 14న భర్త గొంతు కోయడంతో శ్రీనివాసులు కుమార్తె అనిత తీవ్రంగా గాయపడి చికిత్స అనంతరం పుట్టింటికి చేరుకుంది. అయితే శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో ఉన్నఫళంగా ఆమెకు ఆరోగ్య క్షీణించి పరిస్థితి విషమించడంతో హుటాహుటిన తల్లిదండ్రులు ప్రత్యేక వాహనంలో చికిత్స కోసం తిరుపతికి తీసుకెళ్లినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి బాధితురాలి ఇంటికి వెళ్లి ఇంట్లో ఉన్న ఆమె అవ్వాతాతలు గంగులమ్మ, వెంకట్రాముడితో విషయం ఆరా తీశారు. అధైర్యపడొద్దని అండగా ఉంటానంటూ ధైర్యం చెప్పారు. వైద్య ఖర్చుల నిమిత్తం సాయం అందించారు.

నేడు అమడగూరులో 'విజయ సంకల్పయాత్ర'

ఓడీచెరువు: ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చేపట్టిన డాక్టర్ వైఎస్సార్ రైతు విజయ సంకల్పయాత్రలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ సూర్యనారాయణ రెడ్డి, ఎంపీపీ ప్రసాద్ రెడ్డి, జెడ్పీటీసీ కవితా శివశంకర్ రెడ్డి కోరారు.

మూడో రోజు పాదయాత్ర షెడ్యూలు..

ఆదివారం ఉదయం 8 గంటలకు దొన్నికోటవారిపల్లి పాదయాత్ర ప్రారంభమై అమడగూరు మండలం మలకవారిపల్లి ఎగువతండా వద్ద మండలంలోకి ప్రవేశిస్తుంది. దిగువతండా, మలకవారిపల్లి, తుమ్మల, కొత్తపేట రోడ్డు, సద్దలవాండ్లపల్లి, వెంకటనారాయణ పల్లి క్రాస్, కొట్టువారిపల్లి క్రాస్, యర్రగుండువారిపల్లి, గువ్వలపల్లి, మామిడిమాకులపల్లి రోడ్డు, గుండువారిపల్లి మీదుగా అమడగూరుకు చేరుకుంటుంది. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి రాత్రికి అక్కడే బస చేస్తారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని గుట్టకిందపల్లికి చెందిన గొర్రెల కాపరి నారాయణ స్వామి శనివారం రాత్రి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుట్టకిందపల్లికి చెందిన నారాయణస్వామి మద్యం ఎక్కువగా తాగుతుండటంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్థాపం చెందిన నారాయణ స్వామి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమల దేవర ఆలయంలో ప్రత్యేక పూజలు

రామగిరి: మండలంలోని గంగంపల్లి సమీపంలోని తిరుమల దేవర ఆలయంలో వెంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఉదయాన్నే స్వామిని ప్రత్యేక పూలతో అలంకరించారు. పూజల్లో మండల వాసులే కాక, కర్ణాటక, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండల వాసులు పాల్గొని,స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో రోజూ వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు తెలిపారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న నాయకులు

ముదిగుబ్బ: మండల పరిధిలోని నాగారెడ్డిపల్లికి చెందిన పలు టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం ధర్మవరంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి తన నివాసంలో టీడీపీ నాయకులకు కండువాలు వేసి సాదరంగా వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ గంగన్న, శ్రీనివాసులు, గోవిందు, భాస్కర్, కృష్ణమూర్తి, శ్రీరాములు, పక్కీరప్ప, అంజనేయులు ఉన్నారు. అనంతరం పార్టీలోకి చేరిన వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం చూసి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సీవీ నారాయణరెడ్డి, మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి, నాయకులు యోగీశ్వర్‌రెడ్డి, బయపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోండి



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ

బత్తలపల్లి: గ్రంథాలయాలను ప్రజలు, పాఠకులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు రోజూ గ్రంథాలయానికి వచ్చి మీకు నచ్చిన పుస్తకాలు, పేపర్లను చదవాలని సూచించారు. తద్వారా ప్రపంచంలో జరిగే అన్ని విషయాలను తెలుసుకునే వీలవుతుందన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయ సెస్సుపై పంచాయతీ అధికారులతో మాట్లాడారు. గ్రంథాలయ సెస్సు కట్టించాలని గ్రంథాలయ అధికారిణి రాజేశ్వరికి సూచించారు.

ముదిగుబ్బ: స్థానిక గ్రంథాలయాన్ని శనివారం గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠకులకు అందుబాటులో ఉంటూ, పంచాయతీ నుంచి రావల్సిన గ్రంథాలయ సెస్సు వసూలుకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మూడే బొజ్జేనాయక్, సిబ్బంది ఖాదర్ బాషా, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన అవసరం



గ్రామ చిత్రపటాన్ని గీసి వివరిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

తాడిమర్రి: మనం నివసించే గ్రామం, సాగు చేసే పంటలపై అవగాహన కలిగి ఉండాలని శ్రీకృష్ణ దేవరాయ వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ విద్యశ్రీ సూచించారు. శనివారం మండలంలోని చిల్లకొండయ్యపల్లిలో అనంతపురం శ్రీకృష్ణ దేవరాయ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో గ్రామీణ వ్యవస్థాపక అవగాహన, అభివృద్ధి యోజన నిర్వహించారు. తొలుత విద్యార్థులు గ్రామంలో రైతులు ఏయే పంటలను సాగు చేస్తున్నారు? పంటలకు అయ్యే పెట్టుబడులు, పంటలకు ఆశించే చీడపీడలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అధికంగా వేరుశనగ సాగు చేస్తామని, ఆకుమచ్చ తెగులు అధికంగా సోకుతుందని రైతులు తెలిపారు. మాకోజెబ్ 400 గ్రాములు, కార్బండజిమ్ 200 గ్రాములు లేదా క్రోరోసాలోనిల్ 400 గ్రాములు, ఎక్సాకొనజోల్ 400 మిల్లీలు వీటిని 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేసుకోవాలన్నారు. 15 రోజులకు ఒక సారి పిచికారీ చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామ చిత్రపటాన్ని వివిధ రంగులతో నింపి రైతులకు వివరించారు. గ్రామ పుట్టుపుర్వోత్తరాలను తెలిపారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సభ్యులు చందన, ఎస్ఎంఎస్ శశికళ, నవీన్, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

రాప్తాడు: స్థానిక జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు సీనియర్ త్రోబాల్ జట్టు పోటీల్లో ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని త్రోబాల్ అసోసియేషన్ కార్యదర్శి రవికుమార్, పీడీలు కేశవ మూర్తి, రాజశేఖర్ రెడ్డి, ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి త్రోబాల్ జట్టు ఎంపిక జరిగింది. జిల్లా నలుమూలల నుంచి దాదాపుగా 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో దాదాపుగా 16 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కాగా, వారిలో రాప్తాడు జెడ్పీహెచ్ఎస్ నుంచి నరసింహ, అంజలి, నవ్య, హేమలత, భవిత, పవిత్ర, ఇందు, పూజ నందిని రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 27న సత్యసాయి జిల్లాలోని బత్తలపల్లిలో పవన్ కుమార్ రెడ్డి మెమోరియల్ స్టేడియంలో జరుగుతాయన్నారు. విద్యార్థులను ముక్కోటి అంబికా సేవా ట్రస్ట్ వ్యవస్థాపకుడు దంపెట్ల శివ అభినందించారు. కార్యక్రమంలో త్రోబాల్ సంఘ సభ్యులు శివ, శివకుమార్, రాజు, నాగేష్, చైతు, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ



శ్రీరాముడి అక్షింతలు పంపిణీ చేస్తున్న భజన బృందం సభ్యులు

కనగానపల్లి: మండల కేంద్రంలో అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షింతలను భక్తులు శనివారం ఇంటింటా పంపిణీ చేశారు. గ్రామంలోని శ్రీరామ భజన బృందం సభ్యులు రామ కీర్తనలను పాడుకుంటూ ఊరేగింపుగా వెళ్లి, ఇంటింటా పంపిణీ చేశారు. సోమవారం అయోధ్యలో జరిగే రామాలయ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రజలు ఈ అక్షింతలను తలపై వేసుకొని శ్రీరామున్ని స్మరించుకోవాలని భక్తులకు సూచించారు.

రేపు బత్తలపల్లిలో ప్రత్యేక పూజలు

బత్తలపల్లి: ఈనెల 22న అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మండల కేంద్రంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. రామాలయంలో ఉదయం 7 గంటల నుంచి సీతారాములకు అభిషేకం, ఆకుపూజ చేస్తామన్నారు. రామనామ సంకీర్తనల అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి సీతారాముల ఉత్సవ విగ్రహాలను వీధుల్లో ఊరేగిస్తామని వెల్లడించారు. సాయంత్రం ప్రతి ఇంటి ముందు ఐదు దీపాలు వెలిగించాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీకి కదిరి కంచుకోట

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



వైఎస్సార్‌సీపీ నాయకులతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మాజీ ఎమ్మెల్యే కడపల మోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కదిరి: 'కదిరి నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట. ఇక్కడ వరుసగా రెండు సార్లు వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేశాం. ముచ్చటగా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొడతాం' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బి.ఎస్.మక్బూల్ అహ్మద్, మాజీ మంత్రి షాకీర్, సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డితో పర్యటించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కొట్లపల్లి వెంకటరామిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డా.కడపల మోహన్‌రెడ్డి, మైనార్టీ నాయకులు ఇస్మాయిల్, సాదత్‌అలి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పర్వానా ఫయాజ్‌ల ఇంటికి నేరుగా వెళ్లి పలకరించారు. 2024 ఎన్నికల్లో కదిరిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపునకు అందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. మంచి మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పార్టీలు, కులమతాల కతీతంగా ప్రతి ఇంటికీ చేరాయన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పెద్దపీట వేస్తోందన్నారు. అభ్యర్థుల ఎంపికలో కూడా సామాజిక సమీకరణలు బేరీజు వేసుకునే తుది నిర్ణయానికి వస్తున్నట్లు చెప్పారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయదుందుభి మోగించడం ఖాయమన్నారు. అంతకు మునుపు స్థానిక ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డిని ఇంటికెళ్లి కలవాలని మంత్రి ప్రయతిస్తే ఎమ్మెల్యే అందుబాటులో లేరు.

పరామర్శ

తనకల్లు: మండల పరిధిలోని తుమ్మలోల్లపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త టైలర్ శ్రీనివాసులు తల్లి లక్ష్మమ్మ (70) అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహమ్మద్, సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులురెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహం వద్ద పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఎంపీటీసీ ఆదినారాయణ, నాయకులు గంగప్ప నాయుడు, ముస్తాఫా, లక్ష్మీపతి, కుళ్లాయప్ప, నీలకంఠారెడ్డి, పవన్‌కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన 'ఖాద్రీ'



క్యూలైన్‌లో దర్శనం కోసం నిలబడిన భక్తులు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం భక్తులతో కిటకిటలాడింది. కదిరి పరిసరాల ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఖాద్రీశుడిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాదం అందజేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరం



వైద్య చికిత్సలు చేస్తున్న డాక్టర్లు

కదిరి టౌన్: పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో శనివారం న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లింగాల లోకేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మార్క్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 200 మందికి ఉచితంగా బీపీ, షుగర్, గుండె పరీక్షలు చేశారు. 10 మందికి వ్యాధి తీవ్రత ఎక్కువ ఉండటంతో అనంతపురం ఆస్పత్రికి రెఫర్ చేశారు. సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి, జూనియర్ సివిల్ జడ్జి ప్రతిమ, ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ సివి మదన్‌కుమార్,గుండె వైద్య నిపుణులు డాక్టర్ అమర్, మహేష్, అశోక్‌రెడ్డి, నాగరాజు వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

సమష్టి కృషితో మండలాభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

కదిరి అర్బన్: ప్రజా ప్రతినిధులు, అధికారుల సమష్టి కృషితో మండలాభివృద్ధి సాధ్యం. ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలు ఈ నాలుగున్నరేళ్లలో దిగ్విజయంగా పూర్తి చేసుకున్నామని ఎమ్మెల్యే డా. పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దశాబ్దాలుగా రోడ్డు సౌకర్యం నోచుకోని గ్రామాలకు సైతం అప్రోచ్ రోడ్లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వేశామన్నారు. అసైన్డ్ భూములపై రైతులకు సర్వహక్కులు కల్పించి ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోయిందన్నారు. ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు వెచ్చించి, అభివృద్ధి పనులు చేశామన్నారు. కోవిడ్ విపత్కర కాలంలో సంక్షేమ పథకాలు అందజేసినట్లు పేర్కొన్నారు. అనంతరం పలు శాఖల ప్రగతి నివేదికలను అధికారులు సభలో చదివి వినిపించారు. సమావేశంలో తహసీల్దార్ సునీత, జెడ్పీటీసీ రాధాబాయి, ఎంపీడీఓ అంజనప్పతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



పేపర్ ప్లేట్ల యూనిట్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి తదితరులు

ధర్మవరం అర్బన్: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, కమిషనర్ బండి శేషన్న తెలిపారు. శనివారం పట్టణంలోని దుర్గానగర్‌లో పట్టణ ప్రగతి యూనిట్‌ను వార్డు కౌన్సిలర్ రమాదేవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘం సభ్యులకు సుస్థిర జీవనోపాధి కల్పించేందుకు మెప్మా సంస్థ పట్టణ ప్రగతి యూనిట్‌లను ఏర్పాటు చేస్తోందన్నారు. అనంతలక్ష్మి పట్టణ సమాఖ్య ద్వారా స్వశక్తి సంఘం సభ్యురాలు జె.లక్ష్మికి రూ.2.42 లక్షల పేపర్ ప్లేట్ల యూనిట్ ఏర్పాటుకు రుణం రుణం మంజూరు చేయడం జరిగిందన్నారు. మెప్మా ద్వారా యంత్ర పరికరాలు, ఫర్నిచర్ అందించామన్నారు. మెప్మా ద్వారా రూ.39 వేల సబ్సిడీ అందించామని వెల్లడించారు. అనతరం పేపర్ ప్లేట్లను తయారు చేసి అధికారులకు సంఘం సభ్యులు చూపించారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం వెంకటేష్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు అనంతలక్ష్మి, పట్టణ అధ్యక్షురాలు కాంతమ్మ, సమాఖ్య ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్యామ్

బత్తలపల్లి: మండలంలోని రామాపురం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఉద్యోగి శ్యామ్ శుక్రవారం మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ సంఘటన ఆలస్యంలో వెలుగు చూసింది. గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. డి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన శ్యామ్ రామాపురం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. బ్యాంకులో విధుల నిర్వహణకు రామాపురంలో నివాసం ఉంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెలుతున్నట్లు చెప్పి, గ్రామ సమీపంలోని చిత్రావతి నదిలోకి వెళ్లి మాత్రలు మింగినట్లు భార్యకు ఫోన్‌లో సమాచారం అందించాడు. వెంటనే భార్య స్థానికుల సహాయంలో నది వద్దకు చేరుకుంది. అపస్మారకస్థితిలో పడి ఉన్న శ్యామ్‌ను చికిత్స నిమిత్తం ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. అయితే ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదని తెలిసింది.

పకడ్బందీగా కుల గణన



సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ యుగేశ్వరీ దేవి

బత్తలపల్లి: కుల గణన సర్వేను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ యుగేశ్వరీ దేవి, ఎంపీడీఓ సాయిమనోహర్ సూచించారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న కుల గణన సర్వే తీరును పర్యవేక్షించారు. ఇంటింటి సర్వే ఏ విధంగా చేస్తున్నారంటూ వలంటీర్లు, గ్రామ కార్యదర్శులు, వీఆర్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. క్లస్టర్ వారీగా మ్యాపింగ్ చేసిన వలంటీర్లు, గ్రామ కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి సర్వే పూర్తి చేయాలని చెప్పారు. సర్వే సందర్భంగా ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. యాప్‌లో నిర్దేశించిన మేర సమాచారాన్ని తప్పులు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. వారం రోజుల్లో సర్వే పూర్తి చేయాలని, ఇందుకోసం క్లస్టర్ వారీగా వలంటీర్లు రోజువారీ నిర్దేశించిన గృహాల సర్వేను పూర్తి చేయాలని తెలిపారు. కులగణనతో సమాజంలో ఆర్థిక, సామాజిక స్థితిగతులు తెలుస్తాయన్నారు. వివరాల సర్వే నిమిత్తం ఇళ్ల వద్దకు వచ్చే సచివాలయ సిబ్బందికి ప్రజలు వారి కులాన్ని తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్ఏలు నరసింహులు, రాజా తదితరులు పాల్గొన్నారు.